సాక్షి
తూర్పుగోదావరి

శనివారం | 24 | మే | 2025





## రూ.2,00,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి సాయిబాబు, వేంకట సత్యవాణి (విజయవాడ) రూ.2,00,116 విరాళం సమర్పించారు. వారికి ఈఓ వీర్ల సుబ్బారావు బాండ్ రశీదు అందజేశారు.



## అంతర్వేదిలో రూ.60,116

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు జొన్నలగడ్డ సోమశేఖర్, నాగమణి దంపతులు (రాజమహేంద్రవరం) శుక్రవారం రూ.60,116 విరాళం సమర్పించారు.

## బ్యారేజీ వద్ద పెరిగిన నీటిమట్టం



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 7,972 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రం లోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.05 అడుగులకు పెరిగింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

## న్యూస్‌రీల్

### మద్యం షాపులు, బార్లు నిబంధనలు పాటించాలి

- దీనిపై నైట్ పెట్రోలింగ్
- జిల్లా ఎక్సైజ్ అధికారి లావణ్య



ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు నిబంధనలకు అనుగుణంగా పని చేసేలా చూసేందుకు నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తామని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి చింతాడ లావణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమయ పాలన పాటించేలా, లూజు విక్రయాలు, ఎమ్మార్పీకి మించి అమ్మకాలు జరగకుండా చూడటం, అనధికార సిట్టింగ్‌లను నివారించడం, షాపు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు చేపడతామని వివరించారు. షాపుల్లో రికార్డులు సమర్థవంతంగా నిర్వహించేలా, సీసీ కెమెరాలు సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనిలో భాగంగా ప్రతి కానిస్టేబుల్‌కు మూడు నాలుగు షాపుల బాధ్యత అప్పగించామన్నారు. నైట్ పెట్రోలింగ్‌ను ఎస్సై, ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నేరుగా పర్యవేక్షిస్తారని లావణ్య తెలిపారు. మద్యం షాపులు, బార్లు పకడ్బందీగా నిర్వహించేలా ఎక్సైజ్ 'ఐ' మొబైల్ అప్లికేషన్ త్వరలో వస్తుందన్నారు. ఎక్సైజ్ నేరాలకు సంబంధించి ఫిర్యాదులుంటే 14405 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

### ఉపాధ్యాయులకు తప్పని బదిలీలు

రాయవరం: బదిలీ దరఖాస్తుల ప్రక్రియలో టీచర్లు తలమునకలయ్యారు. ఈ నెల 21 నుంచి ఉపాధ్యాయుల బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైన విషయం విదితమే. ఇప్పటికే ప్రధానోపాధ్యాయుల బదిలీ దరఖాస్తుల గడువు ముగియగా, స్కూల్ అసిస్టెంట్ల ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించే గడువు శనివారం అర్ధరాత్రితో ముగుస్తుంది. ఈ నెల 27 వరకూ సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీ దరఖాస్తులకు గడువుంది. బదిలీ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సబ్మిషన్ చేసే సమయంలో ఓటీపీ రావడంలో సమస్యలు తలెత్తుతున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. శుక్రవారం ఉదయం సర్వర్ మొరాయించగా, మధ్యాహ్నం నుంచి పని చేయడంతో దరఖాస్తులు చేసుకున్నారు. పీడీలు దరఖాస్తు చేసుకునేందుకు సర్వర్ ఓపెన్ కాగా, పీఈటీలకు ఓపెన్ కాలేదని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. పూర్వపు తూర్పు గోదావరి జిల్లాలోని 64 మండలాల పరిధిలో 3,696 మంది ఉపాధ్యాయులకు తప్పనిసరి స్థానచలనం ఉంది. ఈ జాబితాలో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీ, తత్సమాన క్యాడర్ ఉపాధ్యాయులున్నారు. వీరిలో రెండేళ్ల లోపు ఉద్యోగ విరమణ అయ్యేవారు, దివ్యాంగ ఉపాధ్యాయులకు వారు కోరుకుంటే తప్ప బదిలీ చేపట్టరు.

**ఖాళీలపై రావాల్సిన స్పష్టత**

క్యాడర్ల వారీగా ఉపాధ్యాయుల ఖాళీలపై స్పష్టత రావాల్సి ఉంది. దరఖాస్తులు సమర్పించిన తర్వాత బదిలీ కోరుకునే ప్రాంతాన్ని ఎంపిక చేసుకునే ఆప్షన్ ఇస్తారు. ఆ సమయానికి పూర్తి స్థాయిలో ఖాళీలను ప్రదర్శించాల్సి ఉంటుంది. ఖాళీలపై స్పష్టత వచ్చిన తర్వాత ఉపాధ్యాయులు ప్రాధాన్యతా క్రమంలో వారు బదిలీ కోరుకునే స్థానాలను ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకుంటారు. ఇప్పటికే గ్రేడ్-2 హెచ్‌ఎంల బదిలీ దరఖాస్తుల గడువు ముగియగా, ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాలను ఈ నెల 24న విడుదల చేయాల్సి ఉంది. దీనిపై అభ్యంతరాలను 25న స్వీకరిస్తారు. 27న ఫైనల్ సీనియారిటీ జాబితాను ప్రదర్శించి, ఖాళీలను తెలియజేస్తారు. 28న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు బదిలీ కోరుకునే ప్రాంతానికి ఆప్షన్స్ ఎంపిక చేసుకుంటారు. ఈ నెల 30 గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు విడుదల కానున్నాయి.

# మినీ మహానాడులో.. టీడీపీ

- కార్యక్రమ నిర్వహణపై అసంతృప్తి
- పద్ధతిగా జరగలేదంటూ గన్ని కృష్ణ ధ్వజం
- జిల్లా అధ్యక్షుడే గైర్హాజరైతే ఎలాగంటూ మండిపాటు
- పార్టీకి జిల్లా కార్యాలయం లేకపోవడమేమిటన్న బొడ్డు
- సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల ఫొటోకు దక్కని చోటు
- నేతల అంతర్గత కుమ్ములాటలు బహిర్గతం



స్వాగత ఫ్లెక్సీలో కనిపించని బుచ్చయ్య ఫొటో



సమావేశం నుంచి బయటకు వచ్చిన బుచ్చయ్య వర్గీయులు



ఎట్టకేలకు వేదిక బ్యానర్‌లో బుచ్చయ్య ఫొటో

సాక్షి, రాజమహేంద్రవరం/రాజమహేంద్రవరం రూరల్: మినీ మహానాడు వేదికగా టీడీపీలో అంతర్గత కుమ్ములాటలు బహిర్గతమయ్యాయి. కార్యక్రమ నిర్వహణ పద్ధతిగా లేదంటూ ఒకరు.. తమ నేతకు ప్రాధాన్యం దక్కలేదని మరో వర్గం.. అసలు పార్టీ కార్యాలయమే లేకపోవడమేమిటని మరొక నేత వ్యాఖ్యానించడంతో సభలో కలకలం రేగింది. స్వపక్షంలోనే నేతలు విపక్షంగా మారి ప్రశ్నల వర్షం కురిపించడం చర్చనీయాంశంగా మారింది. సీనియర్ నేతలే ఆవేదన వెళ్లగక్కడం చూస్తుంటే టీడీపీలో అంతర్గత కుమ్ములాటలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో టీడీపీ జిల్లా స్థాయి మినీ మహానాడు శుక్రవారం నిర్వహించారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వాసు వర్గం కొంత మందికే ప్రాధాన్యం ఇచ్చిందని, మిగిలిన వారిని పక్కన పెట్టిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలు పరస్పరం విమర్శలకు దిగడం ఆ పార్టీ పరిస్థితికి అద్దం పడుతోంది.

**నిర్వహించే పద్ధతి ఇదేనా?**

క్రమశిక్షణకు మారుపేరైన ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీలో క్రమశిక్షణ కొరవడిందని రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) మాజీ చైర్మన్, సీనియర్ నేత గన్ని కృష్ణ ధ్వజమెత్తారు. ఒక పద్ధతి లేకుండా కార్యక్రమం నిర్వహిస్తున్నారని, ప్రొటోకాల్ పాటించడం లేదని అన్నారు. ముందుండి నడిపించాల్సిన జిల్లా అధ్యక్షుడు ఈ కార్యక్రమానికే రాలేదని విమర్శించారు. ఎన్టీఆర్ మీద అభిమానంతో పార్టీలోకి వచ్చామని.. తన వ్యాఖ్యలు కొందరికి కోపం రప్పించినా ఫర్వాలేదన్నారు. పార్టీ క్రమశిక్షణతో నడవాలనే ఉద్దేశాన్ని కుండ బద్దలుగొట్టినట్లు వెల్లడించారు. గన్ని ప్రసంగం పార్టీ శ్రేణుల్లో చర్చకు దారి తీసింది.

**పార్టీ కార్యాలయానికే దిక్కులేదు**

రాజకీయాలకు కీలకమైన తూర్పు గోదావరిలో టీడీపీకి ఇప్పటి వరకూ జిల్లా స్థాయి కార్యాలయం ఏర్పాటు చేయకపోవడంపై రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాలయమే లేదు.. ఇక పార్టీ అంతర్గత నిర్మాణం ఎలా సాధ్యమని ప్రశ్నించారు.

**అగ్నికి ఆజ్యం పోసిన పరిశీలకుడు**

మినీ మహానాడు వేదికగా పార్టీ బలోపేతం, అంతర్గత నిర్మాణం, నేతల ప్రాధాన్యంపై టీడీపీ శ్రేణులు ప్రశ్నించగా.. పుండు మీద కారం జల్లినట్లు.. పార్టీ పరిశీలకుడు, రాష్ట్ర అటవీ కార్పొరేషన్ చైర్మన్ సుజయకృష్ణ రంగారావు చేసిన వ్యాఖ్యలు ఆయా వర్గాల్లో మరింత ఆగ్రహావేశాలు నింపాయి. అనుకున్న పదవులు రానందు వల్లనే నేతలందరూ ఇలా ఆవేదన చెందుతున్నారని అంటూ ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన మాటలు పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారాయి. పార్టీ పరిశీలకుడిగా పరిస్థితిని చక్కదిద్దాల్సింది పోయి.. అగ్నికి ఆయన మరింత ఆజ్యం పోస్తున్నారన్న భావన కార్యకర్తల్లో వెల్లడైంది. ఆయన చేసిన వ్యాఖ్యలతో అందరూ అవాక్కయ్యారు.

**గోరంట్లకు ఘోర అవమానం**

పార్టీ ఆవిర్భావం నుంచీ కీలక నేతగా ఉన్న రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికి ఘోర అవమానం ఎదురైంది. సభా ప్రాంగణం స్వాగత ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఆయన ఫొటోకు చోటు దక్కలేదు. దీంతో కోపోద్రిక్తులైన గోరంట్ల అనుచరులు, పార్టీ నేతలు ఒక్కసారిగా సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఆదిరెడ్డి అప్పారావు, వాసు వ్యవహార శైలికి నిరసనగా డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్, వాసిరెడ్డి రాంబాబు, మజ్జి పద్మావతి నిరసనకు దిగారు. సీనియర్ నేత అనే గౌరవం కూడా లేకుండా ఫొటో పెట్టకుండా అవమానించడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. దీంతో, ఈ పంచాయితీ జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి వెళ్లింది. ఆయన రంగంలోకి దిగి, ఎమ్మెల్యేకి సూచించడంతో చివరకు సభా వేదిక వద్ద ఉన్న బ్యానర్‌లో హుటాహుటిగా బుచ్చయ్య ఫొటో ఏర్పాటు చేశారు.

**ఆది నుంచీ ఇదే తంతు**

- ఆదిరెడ్డి అప్పారావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి మధ్య కొన్నేళ్లుగా వర్గ పోరు నడుస్తూనే ఉంది. తాజాగా పేపర్ మిల్లు వ్యవహారంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పేపర్ మిల్లు కార్మిక సంఘం నాయకుడు ప్రవీణ్ చౌదరిపై ఫోన్‌లో రెచ్చిపోయారు. నీ సంగతి చూస్తానంటూ బెదిరింపులకు దిగారు. వారిద్దరి ఫోన్ కాల్ సంభాషణ వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేసింది. 'నువ్వు వైఎస్సార్ పార్టీలోకి బుచ్చయ్య మాట విని వెళ్లావు. ఏం పీకావు? మా మీద కామెంట్లు చేశావు. విడిచిపెడతాననుకోకు. కామెంట్లకు పనిష్మెంట్లు ఉంటాయి' అంటూ ప్రవీణ్‌పై అప్పారావు ధ్వజమెత్తారు.
- రాజమహేంద్రవరానికి కార్పొరేషన్ ఎన్నికల నిర్వహణలో ఇప్పటికే గోరంట్ల, ఆదిరెడ్డి వర్గాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రూరల్‌కు చెందిన విలీన గ్రామాలతో కలిపి ఎన్నికలు నిర్వహించాలని గోరంట్ల పట్టుబడుతుండగా.. విలీనం లేకుండానే ఎన్నికలకు వెళ్లాలని ఆదిరెడ్డి వర్గం వాదిస్తోంది. ఈ వ్యవహారం ఇప్పటికే సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లింది. ఎన్నికలు ఎప్పుడున్న స్పష్టత రావడం లేదు.
- ఆదిరెడ్డి అప్పారావు, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు – రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మధ్య ఇటీవల రాజమహేంద్రవరం బోధనాస్పత్రి వద్ద మెడికల్ షాపు వివాదం మళ్లీ అగ్గి రాజేసింది. తమకు కావాలంటే తమకే దక్కాలంటూ పట్టుబట్టడంతో ఇరు వర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఇలా ప్రతి విషయంలోనూ వర్గ విభేదాలు రాజుకుంటూనే ఉన్నాయి. ప్రస్తుతం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో మినీ మహానాడు జరగడం.. బుచ్చయ్యతో విభేదాల నేపథ్యంలోనే ఆయన ఫొటోకు స్వాగత ఫ్లెక్సీలో స్థానం కల్పించలేదన్న భావన పార్టీ శ్రేణుల్లో ఉంది. ఎంత విభేదాలున్నా పార్టీ కార్యక్రమానికి అందరూ కలసి రావాలి తప్ప.. ఇలా రచ్చకెక్కడమేమిటని పార్టీ శ్రేణులు అంటున్నాయి.

- జై ఆంజనేయం.. జామకాయల హారం



మహాకాయుడిగా రూపుదాల్చి.. సాగర తరణానికి వాయువేగంతో.. ఒక్కుదుటన బయలుదేరిన ఆంజనేయ స్వామి వారిపై.. మహేంద్రగిరిన ఉన్న చెట్ల పూలన్నీ జలజలా రాలాయట. పర్వత సదృశమైన ఆయన దేహం రంగురంగుల పూల సోయగాలతో మెరిసిపోయిందట. ఇదంతా శ్రీరామాయణం సుందర కాండలో మహర్షి వాల్మీకి వర్ణన. ఆ స్థాయిలో కాకపోయినా.. రాజమహేంద్రవరం ఐదు బళ్ల మార్కెట్ సెంటర్లో వేంచేసియున్న ప్రసన్నాంజనేయ స్వామి వారు శుక్రవారం నవ్యశోభతో దర్శనమిచ్చారు. ఆలయ 31వ వార్షికోత్సవం.. హనుమజ్జయంతి సందర్భంగా స్వామి వారిని శుక్రవారం జామకాయలతో విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి ఆకు పూజలు, సిందూర పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

– ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్)

## సంక్షేమ హాస్టళ్లలో వసతులకు ప్రాధాన్యం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సంక్షేమ వసతి గృహాల్లో అన్ని మౌలిక సౌకర్యాలూ కల్పించాలని, పాఠశాలలు ప్రారంభించే నాటికి ఆయా పనులు పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లా సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతుల కల్పనపై ఆయా శాఖల అధికారులతో కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డ్రాపౌట్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బడి బయటి పిల్లలను గుర్తించి, తిరిగి పాఠశాలలకు వచ్చేలా, వసతి గృహాల్లో సీట్లు కేటాయించాలని ఆదేశించారు. దీని కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కోవిడ్ సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి, హాస్టళ్లలో చేర్పించాలని చెప్పారు. విడాకులు తీసుకున్న, విదేశాలకు వెళ్లిన మహిళల పిల్లలు, అసురక్షిత వాతావరణంలో ఉన్న ఆడ పిల్లలను గుర్తించి హాస్టళ్లలో చేర్పించాలన్నారు. తక్కువ మంది పిల్లలున్న వసతి గృహాలను గుర్తించి, హేతుబద్ధీకరించాలని సూచించారు. అన్ని వసతి గృహాల్లో టీవీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ చెప్పారు.

## పాస్టర్ ప్రవీణ్ సంస్మరణ సభకు అనుమతి లేదు



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నగరంలో శనివారం నిర్వహించ తలపెట్టిన పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభకు అనుమతి లేదని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ హైకోర్టు అనుమతి కోరారన్నారు. దీనిపై ఎటువంటి నిర్ణయం వెలువడనందువలన శాంతిభద్రతల దృష్ట్యా ఈ సభ నిర్వహణకు అనుమతి లేదని, సభకు వచ్చే వారు ఈ విషయం గమనించాలని ఎస్పీ పేర్కొన్నారు.

## ఇది మానవ హక్కుల ఉల్లంఘనే..



విలేకర్లతో మాట్లాడుతున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ: పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభకు ప్రభుత్వం, పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం మానవ హక్కుల ఉల్లంఘనేనని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. నగరంలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసులను అడ్డం పెట్టుకుని సభను అడ్డుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. పోలీసుల టార్చర్ తో గుడాల జాన్సన్ అనే వ్యక్తి గుండెపోటుతో ఆసుపత్రిలో చేరారన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా సభను ఆపేది లేదని, అయితే, ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నామని ప్రకటించారు. త్వరలోనే తేదీ ప్రకటిస్తామన్నారు. సభకు త్వరలోనే హైకోర్టు నుంచి అనుమతి రానున్నదన్నారు. కోర్టుకు తాను ఫోర్జరీ డాక్యుమెంట్లు సమర్పించినట్లు పోలీసులు చెప్పారని, ఇదే నిజమైతే తనపై ఫోర్జరీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రైస్తవులను వివక్షతో చూస్తూ, అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు.

## మహిళల రక్షణే మొదటి ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): బాలికలు, మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ అన్నారు. మహిళలు, బాలికల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై జిల్లా పోలీసు అధికారులు, శక్తి టీములతో జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మహిళా మొబైల్ ఫోన్‌లో శక్తి యాప్ ఇన్‌స్టాల్ చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. తద్వారా 24 గంటలూ పోలీసు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లావ్యాప్తంగా స్కూళ్లు, కాలేజీలు, గుర్తించిన హాట్‌స్పాట్ల వద్ద శక్తి టీముల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో వుమెన్ హెల్ప్ డెస్క్, మహిళల ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీలు ఎంబీఎన్ మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, ఎల్.అర్జున్, స్పెషల్ బ్రాంచి డీఎస్పీ బి.రామకృష్ణ, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసరావు, జోనల్ డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# సేవ చేయనివ్వరు స్వామీ..



సత్యదేవుని సన్నిధిలో సేవకు వచ్చిన కార్యకర్తలు



ప్రధానాలయం వద్ద భక్తులకు మంచినీరు అందిస్తున్న సేవా కార్యకర్తలు

- రత్నగిరిపై స్వచ్ఛంద సేవకులకు ఇబ్బందులు
- సేవకు దేవస్థానంలో ఎవరి అనుమతి తీసుకోవాలో తెలియని పరిస్థితి
- ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని భక్తుల డిమాండ్

అన్నవరం: భక్తవరదుడైన సత్యదేవుని సన్నిధిలో స్వచ్ఛందంగా సేవలు చేద్దామని.. కాస్తంత పుణ్యం మూటగట్టుకుందామని ఎక్కడెక్కడి నుంచో వస్తున్న భక్తులు.. అన్నవరం దేవస్థానంలో చుక్కలు చూస్తున్నారు. సేవ చేద్దామనే ఆశ.. చేయడానికి శక్తి ఉన్నా.. ఎవరిని సంప్రదించాలో.. ఏం చేయాలో తెలియక ఇక్కట్లు పడుతున్నారు. సేవ చేయడానికి వచ్చిన తమను ఏఈఓ కె.కొండలరావు దూషించారంటూ మంచిర్యాల భక్తులు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

రత్నగిరిపై వివిధ ప్రాంతాల్లో కాషాయ రంగు చీరలు ధరించిన మహిళా సేవకులు.. భక్తులకు కనిపిస్తూంటారు. వీరందరూ తెలంగాణలోని వరంగల్, కరీంనగర్, మంచిర్యాల, మన రాష్ట్రంలోని గుంటూరు, నెల్లూరు తదితర దూర ప్రాంతాల నుంచి వస్తున్న స్వచ్ఛంద సేవకులు. వీరందరూ దేవస్థానంలో తమకు నిర్దేశించిన సేవలు ఉచితంగా అందిస్తూంటారు. ఇదేవిధంగా ఇతర ప్రాంతాల నుంచి కూడా స్వామి సన్నిధిలో సేవ చేద్దామనే ఆశతో వస్తున్నా.. రత్నగిరిపై ఎవరిని కలవాలో తెలియని పరిస్థితి నెలకొందని భక్తులు ఆవేదన చెందుతున్నారు.

**సేవా విభాగం లేక..**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రతి రోజూ వేలాదిగా మహిళా సేవకులు వివిధ చోట్ల సేవలందిస్తూంటారు. అలాగే, పరకామణి అంటే హుండీ లెక్కింపుతో పాటు ఇతర సేవలను పురుషులు అందిస్తూంటారు. భక్తులు స్వచ్ఛందంగా సేవ చేయడానికి అనుమతి ఇచ్చేందుకు టీటీడీలో ప్రత్యేకంగా ఒక విభాగం ఉంది. దాని ఫోన్ నంబర్ టీటీడీ వెబ్‌సైట్‌లో ఉంటుంది. సేవకు వెళ్లాలనుకునేవారు ఆ నంబర్‌కు ఫోన్ చేస్తే వారు పూర్తి వివరాలు చెబుతారు. దాని ప్రకారం ఆ సేవా కార్యకర్తలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఎప్పుడు సేవకు రావాలి, ఎవరిని కలవాలనే వివరాలు తెలియజేస్తారు. దాని ప్రకారం భక్తులు అక్కడకు వెళ్లి సేవ చేయవచ్చు. ఇటువంటి ఏర్పాటు అన్నవరం దేవస్థానంలో లేదు. గతంలో సేవ చేసినవారైతే దేవస్థానంలో పరిచయం ఉన్నవారికి ఫోన్ చేసి వస్తున్నారు. కొత్తవారైతే మధ్యవర్తులను ఆశ్రయించి, మోసపోవాల్సిన పరిస్థితి.

మంచిర్యాలకు చెందిన 18 మంది మహిళా సేవా కార్యకర్తలు ఇదేవిధంగా మోసపోయారు. అన్నవరం దేవస్థానంలో సేవ చేసేందుకు మధ్యవర్తిని ఆశ్రయించగా, అతడు మరో మహిళకు ఈ పని అప్పగించాడు. ఆమె అన్నవరం దేవస్థానానికి పంపిస్తానని చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.500 చొప్పున వసూలు చేసింది. తీరా ఇక్కడకు వస్తే సేవ చేయడానికి ఖాళీ లేదని, వెళ్లిపోవాలని ఏఈఓ చిరాకుపడ్డారని వారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ భక్తుల నుంచి రూ.500 చొప్పున వసూలు చేసిన మహిళ.. ఆ తరువాత రూ.300 చొప్పున వెనక్కి ఇచ్చి, మిగిలిన రూ.200 ఉంచుకున్నట్లు అధికారుల విచారణలో తేలింది. ఇటువంటి అవస్థలు భక్తులకు ఎదురవకుండా ఉండాలంటే అన్నవరం దేవస్థానంలో కూడా టీటీడీ తరహాలో ప్రత్యేకంగా విభాగం ఏర్పాటు చేయాలని పలువురు సూచిస్తున్నారు. అనంతరం, సేవ చేయాలనుకునేవారు ఆ విభాగాన్ని సంప్రదించేలా ఫోన్ నంబర్‌ను దేవస్థానం వెబ్‌సైట్‌లో పొందుపరచాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**మాకూ ఇలాగే జరిగింది**



సత్యదేవుని దీక్ష ఉత్సవాల గురించి ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రచారం చేస్తూంటాను. మా ప్రాంతం నుంచి సేవా కార్యకర్తలను అన్నవరం దేవస్థానానికి తీసుకువెళ్తే ఇప్పుడు ఖాళీ లేదని చెప్పారు. దాంతో వెనక్కి వచ్చేశాం. దీనికోసం దేవస్థానంలో ఒక విభాగం ఏర్పాటు చేసి, స్వచ్ఛంద సేవ చేసే భక్తులకు సమయం నిర్దేశిస్తే మేలు.

– కృష్ణ, సేవా కార్యకర్త

# కూటమి హామీలు నెరవేర్చాలి

- సీపీఎస్ ఉద్యోగ సంఘ నేతలు
- కలెక్టరేట్ వద్ద ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల సమయంలో తమకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్‌ఈఏ) అధ్యక్ష సహాయ అధ్యక్షులు పఠాన్ బాజీ, చీర్ల కిరణ్ డిమాండ్ చేశారు. ఈ నెల 1న చిత్తూరులో ప్రారంభమైన సీపీఎస్ ఉద్యోగుల చైతన్య యాత్ర శుక్రవారం రాజమహేంద్రవరం చేరుకుంది. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద నిర్వహించిన సీపీఎస్ ఉద్యోగుల ధర్నాలో నేతలిద్దరూ ప్రసంగించారు. రాష్ట్రంలో 3 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులను ద్వితీయ శ్రేణి ఉద్యోగులుగా మార్చే విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అధికారులు, ప్రభుత్వం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకున్న వారే లేరన్నారు. సీపీఎస్ ఉద్యోగులు ఆర్థికంగా, సామాజికంగా ఒత్తిడి ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం చెప్పే మాటలకు, చేస్తున్న పనులకు పొంతన లేకుండా ఉందన్నారు. ఎన్నికల సమయంలో సీపీఎస్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు తప్పనిసరిగా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్ఓ టి.సీతారామ్మూర్తికి సీపీఎస్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ విల్సన్‌పాల్, సహాధ్యక్షుడు డీఎస్ చాంబర్లీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జీఎస్ రమేష్, ఉపాధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీలు జె.రాజారావు, కె.గోపాలకృష్ణ, కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కాట్రేనికోన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండల కేంద్రం సుబ్బారాయుడు గుడి వద్ద శుక్రవారం ఉదయం పల్లం నుంచి కాకినాడ వెళ్లే ఆర్టీసీ బస్సు మోటారు సైకిల్‌ను ఢీ కొట్టడంతో సాగిరాజు శ్రీనివాస నరసింహరాజు (49) మృతి చెందారు. కాట్రేనికోన ఎస్సై అవినాష్ తెలిపిన సమాచారం ప్రకారం అమలాపురం డిపో ఆర్టీసీ బస్సు పల్లం నుంచి కాకినాడ వెళుతున్న సమయంలో ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను ఢీ కొట్టింది. నరసింహరాజును స్థానికులు 108 అంబులెన్సులో అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అయినవిల్లి మండలం పోతుకుర్రుకు చెందిన సాగిరాజు శ్రీనివాస నరసింహరాజు కోనపాకపేట ఆనంద హేచరీలో పని చేస్తున్నాడు. అక్కడకు వస్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. ఈయనకు భార్య రాజేశ్వరి, ఇద్దరు పిల్లలు యూకేలో ఉన్నారు. యూకేలో కుమార్తె ఉద్యోగం చేస్తుండగా, కుమారుడు ఎంఎస్ చదువుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాట్రేనికోన ఎస్సై అవినాష్ తెలిపారు.

**చికిత్స పొందుతూ...**



శేషగిరిరావు (ఫైల్)

కె.గంగవరం: మండలంలోని అముజూరుకి చెందిన పాలపర్తి శేషగిరిరావు(60) కాకినాడలో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. శేషగిరిరావు రామచంద్రపురం నుంచి స్వగ్రామం అముజూరు వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో స్థానికులు అతడిని పామర్రు పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కె.గంగవరం ఎస్సై జానీ బాషా శుక్రవారం విలేకరులకు తెలిపారు.


**గిరిజన సహకార సంస్థ లి., రంపచోడవరం**

రేఖా సంఖ్య నెం.18/2019-డి.ఆర్స్ తేది.23.05.2025

**టెండర్ ప్రకటన**

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని 7 మండలములకు మరియు చింతూరు ఐటీడీఏ పరిధిలోని 4 మండలములలో వున్న గిరిజన సంక్షేమ వసతి గృహములు, ఆశ్రమ పాఠశాలలు మరియు రెసిడెన్సియల్ స్కూల్స్, కాలేజీలకు అవసరమగు నిత్యావసర సరుకులు **జూన్, 2025 నుండి ఆగస్ట్, 2025 (3 నెలలకు)** అరువు పద్ధతిలో సరుకులు సరఫరా చేయుటకు టెండర్లు కోరబడుచున్నవి. ఆసక్తి గలవారు తమ టెండర్లను **ది.30-05-2025 మధ్యాహ్నం 1.00 గంట వరకు** గిరిజన సహకార సంస్థ లి., రంపచోడవరం డివిజనల్ మేనేజర్ వారి కార్యాలయంలో సమర్పించగలరు. టెండర్ ఫారంతోపాటు నిత్యావసర వస్తువుల సరఫరాదారులు ఇ.ఎం.డి రూపంలో రూ.2,00,000/- (రెండు లక్షలు మాత్రమే) ఏదైనా జాతీయ బ్యాంకు నందు డిమాండు డ్రాఫ్టును డివిజనల్ మేనేజర్, గిరిజన సహకార సంస్థ లి., రంపచోడవరం వారి పేరు మీద చెల్లుబడి అగునట్లు తీసి తప్పనిసరిగా జతపరచవలెను. ఈ విషయంలో సహకార ఏజెన్సీలు/చిన్న తరహా పరిశ్రమలతోపాటు మరెవరికి ఎటువంటి మినహాయింపులు ఉండవు. అదేరోజు అనగా **ది.30-05-2025 3.00 గంటలకు** టెండర్ దారుల సమక్షంలో టెండర్-కం-నెగోషియేషన్స్ శ్రీ ప్రాజెక్ట్ అధికారి, ఐటిడిఏ, రంపచోడవరం వారి ఆధ్వర్యంలో నిర్వహించబడును. టెండర్ ఫారంలో రేటు దాఖలు చేసిన టెండర్ దారులు **ప్రతీ సరుకునకు ఒక కేజీ పరిమాణమునకు తక్కువ కాకుండా శాంపిల్స్ తీసుకొని రావలెను. శాంపిల్స్ తీసుకొని రాని టెండర్ దారులు ఆ సరుకు పాడుటకు అర్హులు కారని తెలియజేయుచున్నాము.** GST రిజిస్ట్రేషన్ లైసెన్స్ మరియు పాన్ నెంబర్ గత రెండు సంవత్సరముల ఆదాయ పన్ను రిటర్న్ లు తాలూకు కాపీలు టెండర్ ఫారమునకు జతపరచి సమర్పించవలెను. షైవన్ని లేనియెడల టెండర్లు స్వీకరించబడవు. దీనికి సంబంధించిన టెండర్ ఫారములు జి.సి.సి., రంపచోడవరం, డివిజనల్ కార్యాలయములో రూ.1,500/- చెల్లించి పొందగలరు.

కాంటాక్టు నెంబర్: 6302364932

**ప్రాజెక్ట్ ఆఫీసర్,** ఐటిడిఏ/ఛైర్మన్ పర్చేజ్ కమిటీ, జి.సి.సి., రంపచోడవరం.


# ఈసారి ట్రావెల్ సర్వే!

- అన్నవరం దేవస్థానం, ఇరిగేషన్ అధికారుల మధ్య 15 ఏళ్లుగా స్థల వివాదం
- ఇప్పటికి మూడుసార్లు సర్వే చేసినా తేలని సమస్య

అన్నవరం: వీర వేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ఘాట్‌రోడ్ పక్కనే పంపా రిజర్వాయర్‌ను అనుకుని ఉన్న స్థలంపై నెలకొన్న వివాదం తేల్చేందుకు ట్రావెల్ సర్వే చేయించాలని నిర్ణయించారు. ఈ స్థలం దేవస్థానానిదా లేక, ఇరిగేషన్ శాఖకు చెందుతుందా అనే దానిపై 15 సంవత్సరాలుగా వివాదం కొనసాగుతోంది. ఈ స్థలం హక్కుదారులను తేల్చేందుకు ఇప్పటికి మూడుసార్లు సర్వే చేశారు. తాజాగా మొత్తం దేవస్థానానికి సంబంధించిన స్థలాన్ని కూడా కలిపి ట్రావెల్ సర్వే చేయించాలని నిర్ణయించినట్లు పెద్దాపురం ఆర్డీఓ రమణి తెలిపారు.

**దేవస్థానం రికార్డుల ప్రకారం రత్నగిరి నుంచి పంపా వరకు దేవస్థానానిదే...**

అన్నవరం దేవస్థానానికి అరెంపూడి గ్రామ సర్వే నంబర్ 24.బి లో 54.69 ఎకరాల కొండ ఉంది. దేవస్థానం క్వార్టర్స్ నుంచి ప్రారంభమై రత్నగిరి రామాలయం నుంచి పంపా రిజర్వాయర్ వరకు ఉన్న స్థలం రికార్డులలో దేవస్థానానికి చెందినదిగా నమోదై ఉంది.

### 2011లో తొలిసారి సర్వే

2011లో అప్పటి ఈఓ కే రామచంద్రమోహన్ తమ రికార్డుల ప్రకారం ఆ స్థలమంతా దేవస్థానానిదేనని, అందువలన సర్వే చేయించాలని ప్రభుత్వాన్ని కోరడంతో సర్వే ప్రారంభించారు. అయితే కొన్ని న్యాయపరమైన ఇబ్బందులు ఉండడంతో ఆ సర్వే మధ్యలోనే నిలిచిపోయింది.

ఇందులో రెండో ఘాట్‌రోడ్‌ను అనుకుని పవర్‌హౌస్ వరకు ఉన్న పంపా రిజర్వాయర్ స్థలం కూడా తమదేనని దేవస్థానం అధికారులు అంటున్నారు. ప్రస్తుతం పంపా రిజర్వాయర్‌ను అనుకుని ఉన్న ఆ స్థలంలో 25 సంవత్సరాలుగా హరిణి బోట్ షికార్, అభయ హోటల్ పేరుతో ప్రయివేట్ నిర్మాణాలు ఉన్నాయి. ఈ స్థలాన్ని ఇరిగేషన్ శాఖ నుంచి లీజుకు తీసుకున్నట్లు ఆ నిర్మాణాల నిర్వాహకులు చెబుతున్నారు.

**వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆక్రమణలు ఖాళీ చేయించాలని ఆర్డినెన్స్**

2023లో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్ -5 ప్రకారం దేవస్థానం స్థలం ఆక్రమించిన వారికి నోటీసు ఇచ్చి, తగు సమాధానం చెప్పకపోతే



పంపా రిజర్వాయర్ ఒడ్డున వివాదాస్పద స్థలంలో ప్రయివేట్ నిర్మాణాలు

ఆక్రమణలు కూల్చి వేయాలని పేర్కొన్నారు. దాని ప్రకారం దేవస్థానం అధికారులు హరిణి బోట్ షికార్, అభయ్ హోటల్ అక్రమ నిర్మాణాలని గుర్తించామని ఇరిగేషన్ అధికారులకు గత ఏడాది జూలైలో నోటీసు ఇచ్చారు. ఆ నోటీస్‌కు ఇరిగేషన్ అధికారులు స్పందిస్తూ అది తమ స్థలమేనని తెలిపారు. దీనిపై అప్పటి దేవస్థానం ఈఓ కే రామచంద్రమోహన్ కలెక్టర్‌కు నివేదిక పంపడంతో దీనిపై జాయింట్ సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. గతేడాది ఆగస్టులో జాయింట్ సర్వే నిర్వహించారు. ఆ సర్వేలో ఆ స్థలం దేవస్థానానిదేనని తేలింది. దానిపై ఇరిగేషన్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో మళ్లీ జాయింట్ సర్వేకు కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు.



ఏప్రిల్ ఒకటో తేదీన జరిగిన సర్వేలో పంపా రిజర్వాయర్ రికార్డులు పరిశీలిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ రమణి, ఇతర అధికారులు

**అధికారుల సమక్షంలో జాయింట్ సర్వే**

ఏప్రిల్ ఒకటో తేదీన పంపా రిజర్వాయర్ స్లూయిజ్ గేట్లు ఎదురుగా గల కొండ వద్ద నుంచి పవర్ హౌస్‌కు వెళ్లే మార్గంలోని హరిణి బోట్ షికార్ నిర్మాణాల వరకు జాయింట్ సర్వే నిర్వహించారు. లాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ డి.భారతి, డిస్ట్రిక్ట్ లాండ్ రికార్డ్స్ అండ్ సర్వే డీఈ కే శ్రీనివాస్, అన్నవరం దేవస్థానం డీసీ చంద్రశేఖర్, ఏసీ రామ్మోహన్‌రావు, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు హాజరయ్యా రు. పెద్దాపురం ఆర్డీఓ కే రమణి పంపా ఒడ్డున గల నిర్మాణాలను పరిశీలించారు. దేవస్థానం, ఇరిగేషన్ అధికారుల వాదనలను విన్నారు. అయితే 50 రోజులు దాటినా ఈ సర్వే నివేదిక వెలుగు చూడలేదు.

**ట్రావెల్ సర్వే చేయించాలని నిర్ణయించాం**

కాగా ఈ వివాదం సంక్లిష్టంగా మారినందున 24 బీ సర్వే నంబర్‌లో ఉన్న దేవస్థానం లాండ్ అంతా కలిపి ట్రావెల్ సర్వే చేయించాలని నిర్ణయించాం. త్వరలోనే ఈ సర్వే చేయిస్తాం.

– కే రమణి, ఆర్డీఓ, పెద్దాపురం

# రూ.13 లక్షల బంగారు ఆభరణాల పట్టివేత

- మరో రూ.35 లక్షల బంగారం ముత్తూట్ ఫైనాన్స్‌లో...
- చైన్ స్నాచర్ అరెస్టు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పలు చైన్ స్నాచింగ్ కేసుల్లో ముద్దాయిని త్రీటౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.13 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు పట్టుకున్నారు. ఆ వివరాలను వెల్లడించేందుకు సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్‌బాబు శుక్రవారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. క్రైం అడిషనల్ ఎస్పీ ఎల్.అర్జున్ సూచనల మేరకు త్రీ టౌన్ సీఐ వి.అప్పారావు బంగారు ఆభరణాల దొంగలపై దృష్టి సారించి ప్రత్యేక పోలీసు బృందాలతో చైన్ స్నాచర్స్ ఆటకట్టించే దిశగా చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా నగర శివారులోని కాతేరు గామన్ బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో నిడదవోలు మండలం తాడిమళ్లకి చెందిన దేశాల ప్రవీణ్ బైక్‌పై కొవ్వూరు వైపు నుంచి కాతేరు వైపు వస్తున్నాడు. ఆ సమయంలో పోలీసులు అతనిని ఆపి ప్రశ్నిస్తున్నారు. ఆ సమయంలో అతను తప్పించుకునే ప్రయత్నం చేశాడు. దీంతో పోలీసులకు అనుమానం వచ్చి అతనిని విచారించారు. జల్సాలు, కోడిపందేలకు అలవాటు పడి మోటారు సైకిల్‌పై ఏదైనా నేరం చేద్దామని నిర్ణయించుకుని తిరుగుతున్నానని, అతను పోలీసులకు తెలిపాడు. ఆ విధంగా చైన్ స్నాచింగ్‌కు అలవాటు పడి రాజమహేంద్రవరం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం పరిసర ప్రాంతాల్లో 12 చైన్ స్నాచింగ్ నేరాలను చేసినట్లు



నిందితుడితో పోలీసులు

ప్రవీణ్ ఒప్పుకున్నాడు. అంతేకాక సుమారు రూ.35 లక్షల చోరీ సొత్తు అతని వద్ద ఉన్నట్లు చెప్పాడు. అవి ముత్తూట్ ఫైనాన్స్, ఇతర ప్రాంతాల్లో ఉన్నాయని, వాటిని త్వరలోనే రికవరీ చేస్తామని పోలీసులు తెలిపారు. అయితే అతని వద్ద ప్రస్తుతానికి సుమారు రూ.13 లక్షలు విలువైన 130 గ్రాముల బంగారం పోలీసులు స్వాధీనం చేసుకున్నా రు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన త్రీటౌన్ సీఐ వి.అప్పారావు, సీసీఎస్ సీఐ శ్రీధర్‌కుమార్, ఎస్సై వి.అప్పలరాజు, ఎస్సై ఆనందరెడ్డి, బీఎస్‌కే.స్వామి, హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణ, కానిస్టేబుల్ సురేష్‌ను ఎస్పీ డి.నరసింహకిశోర్ అభినందించారు.

# నా బిడ్డలను చూస్తాననుకోలేదు

- ఖతార్ నుంచి క్షేమంగా ఇంటికి చేరుకున్న బాధితురాలు
- తిండి పెట్టకుండా, పిల్లలతో మాట్లాడనీయకుండా నరకం చూపించారంటూ ఆవేదన

అంబాజీపేట: కుటుంబ అవసరాల నిమిత్తం జీవనోపాధికి ఇతర దేశానికి వెళ్లిన ఓ మహిళకు అక్కడి వారు పెట్టిన టార్చర్ తట్టుకోలేక నరకం అనుభవించింది. అక్కడ పడుతున్న ఇబ్బందులను రిస్క్ చేసి తన భర్తకు వీడియో, వాయిస్ మెసేజ్ ద్వారా సమాచారం అందించింది. దాంతో తన భర్త ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సహకారంతో స్వగ్రామానికి క్షేమంగా చేరుకుంది ఆ మహిళ. వివరాల్లోకి వెళితే... అంబాజీపేట మండలం తొండవరం సత్యవతికాలనీకి చెందిన ఉందుర్తి నాగదుర్గ ఈ గత ఏడాది ఆగస్టు 29న తన సమీప బంధువుల సహకారంతో ఖతార్ బయలుదేరింది. 31న ఖతార్ చేరుకుని అక్కడ ఉన్న ఓ మేడం వద్ద వంటపనికి చేరింది. ఆ యజమానురాలి వద్ద నాలుగు నెలల పాటు సజావుగా గడిచింది. అనంతరం ఆమె కుమార్తె వచ్చి తన పని నచ్చడంతో ఖతార్‌లో ఓ సిటీలో ఉంటున్న తన ఇంటికి తీసుకువెళ్లింది. రెండు నెలలు బాగానే చూసుకున్నారు. అనంతరం తిండి పెట్టకుండా, భర్త ప్రశాంత్, పిల్లలతో, బంధువులతో ఫోన్ మాట్లాడకుండా చిత్రహింసలు పెట్టారు. ఆమె వద్ద ఉన్న ఫోన్‌ను, పాస్‌పోర్టును తీసేకుని హింసించారు. అక్కడ పెట్టే చిత్రహింసలు భరించలేక తన భర్త ప్రశాంత్ వాట్సాప్‌కు వీడియో, వాయిస్ మెసేజ్‌లను పంపించింది. వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను రిస్క్ చేసి తీసుకుని, మెసేజ్ పెట్టింది. స్థానిక సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు, ఉప సర్పంచ్ దిగుమర్తి చిట్టిబాబులకు ఆమె భర్త విషయం తెలియపర్చారు.



తొండవరంలో తన బిడ్డలతో సంతోషంగా ఉన్న నాగదుర్గ

ఖతార్‌లో ఉన్న ఓ బాబా ద్వారా పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా వారు ఇండియన్ ఎంబాసీని సంప్రదించారు. అక్కడ నుంచి వారు ఇండియాకు పంపారు. ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు విషయాన్ని తెలియపరచి వారి సహకారంతో ఈ నెల 22 అర్ధరాత్రి స్వగ్రామానికి ఆమె చేరుకుంది.

**అందరికీ కృతజ్ఞతలు**

ఖతార్ వెళ్లి సుమారు 9 నెలలు కావస్తోంది. వెళ్లిన తరువాత ఐదు నెలలు నా బిడ్డలతో ఫోన్‌లో మాట్లాడుతూ ఉంటే సంతృప్తి కలిగేది. వారి యోగ క్షేమాలు ఎప్పటికప్పుడు తెలుసుకునే దానిని. అనంతరం ఓ ఇంటిలో కుక్‌గా చేరడంతో ఫోన్, పాస్‌పోర్టు తీసేసుకుని నన్ను చిత్రహింసలు పెట్టారు. ఇండియాకు వెళ్లాలంటే రూ.1.80 లక్షలు కట్టాలని యజమానురాలు బెదిరించేది. అసలు నా బిడ్డలను చూడగలనా, ఎలా ఇంటికి వెళ్లాలో అర్థంకాని పరిస్థితుల్లో కాలం వెళ్లదీశాను. స్వగ్రామం వచ్చేందుకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు.

– నాగదుర్గ

## గోపాయిలంక గడ్డి రేవులో మృతదేహం

అల్లవరం: మండలంలోని గోడితిప్ప పంచాయతీ పరిధిలో గోపాయిలంక గడ్డిరేవు వద్ద శుక్రవారం అంబాజీపేట మండలం వాకలగరువు గ్రామానికి చెందిన సుంకర దుర్గాప్రసాద్ (44) మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. నాలుగు రోజులుగా గడ్డి రేవులో మోటార్ సైకిల్‌ను పార్క్ చేసి ఉంచడంతో స్థానికులకు అనుమానం వచ్చి అల్లవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ సమాచారంతో పోలీసులు మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే శుక్రవారం ఉదయం గడ్డి రేవులో దుర్గాప్రసాద్ మృతదేహం తేలియాడటంతో స్థానికులు గుర్తించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం వాకలగరువులో వాటర్ ప్లాంట్ నిర్వహించే దుర్గాప్రసాద్ లైన్‌కి వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. గోపాయిలంక గడ్డిరేవులో బహిర్భూమికి వెళ్లిన దుర్గాప్రసాద్ ప్రమాదవశాత్తూ నదిలో పడిపోయి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై అల్లవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## మద్యం, సారా ధ్వంసం

అమలాపురం టౌన్: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులకు సంబంధించి స్వాధీనం చేసుకున్న మద్యం, సారాను స్టేషన్ ప్రాంగణంలో శుక్రవారం ధ్వంసం చేసినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ ఎస్ కేడీవీ ప్రసాద్ వెల్లడించారు. మొత్తం 105 కేసుల్లో పట్టుబడ్డ 18.90 లీటర్ల సారా, 155.505 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేశామన్నారు. అమలాపురం పట్టణ వీఆర్వో మహ్మద్ జహీరా, నల్లమిల్లి వీఆర్వో జి. శ్రీరామచంద్రమూర్తి సమక్షంలో ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## దుళ్ల శివార్లలో అగ్ని ప్రమాదం

– రూ.5 లక్షల మేర ఆస్తినష్టం

కడియం: మండలంలోని దుళ్ల గ్రామ శివార్లలోని సత్యసాయి ఇండస్ట్రీస్‌లో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కొబ్బరి తాళ్ల ఉత్పత్తికి సంబంధించిన ఫైబర్ మెటీరియల్, విద్యుత్ ఉపకరణాలు పూర్తిగా దగ్ధమైపోయాయి.




ఫ్యాక్టరీలో దగ్ధమైన మెటీరియల్

ప్రమాదం కారణంగా సుమారు రూ.5లక్షల మేర నష్టం ఏర్పడిందని ఫ్యాక్టరీ అధినేత కృష్ణసాయి తెలిపారు. కార్మికులు సెలవు పెట్టడంతో కొద్దిరోజులుగా ఉత్పత్తి నిలిపివేశామన్నారు. నెలాఖరుకు ఉత్పత్తిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అందులో భాగంగా రా మెటీరియల్‌ను తీసుకువచ్చి నిల్వ చేశామని వివరించారు. రా మెటీరియల్ కావడంతో దానికి ఇన్స్రూ కూడా లేదన్నారు. అయితే ప్రమాదం ఏ విధంగా సంభవించిందో అర్థం కావడం లేదన్నారు. ఫ్యాక్టరీ నుంచి మంటలు రావడం గుర్తించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో వచ్చి చూస్తే ఫైబర్ మెటీరియల్‌తోపాటు, ఎలక్ట్రికల్ పరికరాలు, ఫ్యాక్టరీ రేకులు సైతం మంటల్లో చిక్కుకున్నాయని వివరించారు. మండపేటకు చెందిన అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారొచ్చి పక్కనే ఉన్న ఇతర ముడి పదార్థాలకు మంటలు వ్యాపించకుండా అడ్డుకున్నారన్నారు.

**గ్యాస్ సిలిండర్ లీకై...**

తాళ్లపూడి: మండలంలోని రావూరుపాడులో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు రావడంతో ఇంట్లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మేకా వెంకన్న భార్య మేక సత్తెమ్మ కొత్త ఇంటి నిర్మాణం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటి సమీపంలో చిన్న షెడ్డు వేసుకుని నివాసం ఉంటున్నారు. గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాపించడంతో ఇంట్లోని వస్తువులతో పాటు, ఇంటి నిర్మాణం కోసం పెట్టుకున్న నగదు కూడా కాలిపోయిందని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది వివరాలు సేకరించారు.



రావూరుపాడులో గ్యాస్ సిలిండర్ లీకై అగ్ని ప్రమాదం జరిగిన షెడ్డు

## జేఈఈ మెయిన్, బి-ఆర్క్, బి-ప్లాన్ ఫలితాలలో తిరుమల విద్యార్థుల సంచలనం



కె.యశ్వంత్‌సాత్విక్, బి-ఆర్క్ 1వ ర్యాంకు, బిప్లాన్, 3వ ర్యాంకు (ఈడబ్ల్యుఎస్)



వి.రామసాయి వరుణ్‌రెడ్డి, బి-ఆర్క్ 4వ ర్యాంకు, బిప్లాన్ 3వ ర్యాంకు (ఈడబ్ల్యుఎస్)

రాజమహేంద్రవరం రూరల్: జేఈఈ మెయిన్, బి-ఆర్క్, బి-ప్లాన్ ఫలితాలలో రాజమహేంద్రవరంలోని తమ తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ప్రకటనలో తెలిపారు. బి.ఆర్క్ జనరల్ ఈడబ్ల్యుఎస్ విభాగంలో కె.యశ్వంత్‌సాత్విక్ ఆల్‌ఇండియా 1వ ర్యాంకు, వి.రామసాయివరుణ్‌రెడ్డి 4వ ర్యాంకు సాధించారని తెలిపారు. బి.ప్లానింగ్ విభాగంలో వివిధ కేటగిరీలలో జాతీయస్థాయిలో కె.యశ్వంత్‌సాత్విక్ 3వ ర్యాంకు, వి.రామసాయి వరుణ్‌రెడ్డి 3వ ర్యాంకు, టి.షణ్ముఖ శ్రీనివాస్ 24వ ర్యాంకు, టి.జశ్వంత్‌దొర 63వ ర్యాంకు, వై.సాయితేజ, టి.పవన్‌శ్రీకుమార్‌చౌదరి 78వ ర్యాంకు, సుంకర జోషిచంద్ 99వ ర్యాంకు సాధించారని ఆయన తెలిపారు. విద్యార్థులను నున్న తిరుమలరావు, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి అభినందించారు.

## గ్రేడ్-2 హెచ్‌ఎం బదిలీలకు 245 దరఖాస్తులు

రాయవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల బదిలీలకు 245 దరఖాస్తులు వచ్చాయి. గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల బదిలీలకు ఈ నెల 21, 22 తేదీల్లో దరఖాస్తులు చేసుకున్నారు. ఈ బదిలీ దరఖాస్తుల్లో రిక్వెస్ట్ బదిలీలకు 181 దరఖాస్తులు రాగా, తప్పనిసరి బదిలీలకు 64 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులను రెండు దశల్లో వెరిఫికేషన్ చేస్తున్నారు.

## 44 సమ్మర్ వీక్లీ స్పెషల్ రైళ్లు



రాజమహేంద్రవరం సిటీ: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని జూన్ ఒకటో తేదీ నుంచి జూలై 31వ తేదీ వరకు రాకపోకలు సాగించేందుకు 44 సమ్మర్ వీక్లీ స్పెషల్ రైళ్లను ప్రకటిస్తూ రైల్వే అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖపట్నం- ఎస్ఎంవీటీ బెంగళూరు, ఎస్ఎంవీటీ బెంగళూరు (08581/ 08582) రైళ్లు జూన్ 1వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు ప్రతీ సోమ, మంగళ వారాల్లో రాకపోకలు సాగించనున్నాయి. విశాఖపట్నం -తిరుపతి, తిరుపతి విశాఖపట్నం (08547/ 08548) రైళ్లు జూన్ 6వ తేదీ నుంచి జూలై 31వ తేదీ వరకు ప్రతీ బుధ,గురువారాల్లో రాకపోకలు సాగించనున్నాయి. విశాఖపట్నం- చర్లపల్లి, చర్లపల్లి -విశాఖపట్నం (08579/ 08580) రైళ్లు జూన్ 6వ తేదీ నుంచి జూలై 26వ తేదీ వరకు ప్రతీ శుక్ర, శనివారాలలో రాకపోకలు సాగించనున్నాయని అధికారులు తెలిపారు. ఈ రైళ్లు సామర్లకోట, రాజమహేంద్రవరం, అన్నవరం, తుని స్టేషన్లలో ఆగనున్నాయని తెలిపారు.

## అంబాజీపేట కొబ్బరి మార్కెట్



| కొబ్బరి రకం | ధర (రూ.ల్లో) |
|---|---|
| కొత్తకొబ్బరి (క్వింటాల్) | 14,000 - 14,500 |
| కొత్తకొబ్బరి (రెండవ రకం) | 9,500 - 10,000 |
| కురిడీ కొబ్బరి (పాతవి) | |
| గండేరా (వెయ్యి) | 22,500 |
| గటగట (వెయ్యి) | 20,000 |
| కురిడీ కొబ్బరి (కొత్తవి) | |
| గండేరా (వెయ్యి) | 21,500 |
| గటగట (వెయ్యి) | 19,500 |
| నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి) | 13,500 - 14,000 |
| కొత్త (పచ్చి)కాయ (వెయ్యి) | 13,500 - 14,000 |
| కొబ్బరి నూనె (15 కిలోలు) | 3,750 |
| ఒక కిలో | 260 |

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. బైక్‌ను వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బైక్‌తో పాటు యువకులు కూడా సుమారు వంద మీటర్ల దూరంలో ఎగిరి పడ్డారు. స్థానిక పోలీసుల కథనం మేరకు పెద్దాపురం గ్రామానికి చెందిన నవుడు వీర వెంకట మణికంఠ తన స్నేహితుడు కిషోర్‌తో కలిసి బైక్‌పై ప్రత్తిపాడులోని ఓ వివాహ వేడుకకు హాజరయ్యేందు వస్తున్నాడు. స్థానిక హైవేపై నరేంద్రగిరి వద్ద వీరి బైక్‌ను జగ్గంపేట నుంచి అన్నవరం వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌తో పాటు యువకులు లంపకలోవ రోడ్డులో ఎగిరి పడ్డారు. తీవ్రంగా గాయపడిన మణికంఠ, కిషోర్‌లను 108 అంబులెన్సులో ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వారిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




ప్రత్తిపాడు ఎన్‌హెచ్‌పై నరేంద్రగిరి వద్ద బైక్‌ను ఢీకొన్న వాహనం


జేఈఈ మెయిన్, బీఆర్‌కే, బి ప్లానింగ్ ఫలితాల్లో

# శ్రీ షిర్డీసాయి విజయభేరి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జేఈఈ మెయిన్స్, బీఆర్‌కే, బి ప్లానింగ్ ఫలితాలలో శ్రీ షిర్డీ సాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య శుక్రవారం తెలిపారు. లక్ష్యా ఐఐటీ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఐ.శ్రీ సాయి హిమ్నీష్ బి ప్లానింగ్‌లో జాతీయ స్థాయిలో 1వ ర్యాంకు సాధించగా, సీహెచ్ మోక్షిత్ 7వ ర్యాంకు, బీఎస్ఏకే రిషిక్ 8వ ర్యాంకు, మోహన్ శ్రీరామ్ జీ 50వ ర్యాంకు, ఎన్.నిశాంత్ నాగ్ 54 వ ర్యాంకు, మోహిత్ సత్య రాజ్ కిరణ్ 77వ ర్యాంకు కైవసం చేసుకున్నారు.

బీఆర్‌కే విభాగంలో ఐ.శ్రీ సాయిహిమ్నీష్ జాతీయ స్థాయిలో 2వ ర్యాంకు సాధించగా, సీహెచ్ మోక్షిత్ 20వ ర్యాంకు, బీఎస్ఏకే రిషిక్ 36 వ ర్యాంకు, ఎన్.నిశాంత్ నాగ్ 39వ ర్యాంకు సాధించారన్నారు. విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల




బి ప్లానింగ్‌లో జాతీయ స్థాయి 1వ ర్యాంకు సాధించిన ఐ.శ్రీ సాయి హిమ్నీష్‌ను అభినందిస్తున్న చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య

శ్రీధర్ మాట్లాడుతూ ఏటా తమ విద్యార్థులు మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌లోనే కాక బీఆర్‌కే, బి.ప్లానింగ్ విభాగాలలో అత్యుతమ ర్యాంకులు సాధించటంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, లక్ష్యా అకాడమీ డీన్ చంద్ర శేఖర్ అభినందించారు.


# ఎమ్మెల్యే అశోక్ ఫొటోతో ఫేక్ అకౌంట్

**మోసాలు చేస్తున్న నిందితుడి అరెస్ట్**



మోసాలకు పాల్పడుతున్న నిందితుడు వంశీ

యానాం: యానాం నియోజకవర్గ శాసనసభ్యులు గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ ఫొటోతో ఫేక్ అకౌంట్‌తో షాది డాట్‌కమ్‌ను ప్రారంభించి పలువురిని మోసం చేస్తున్న ఘటనకు సంబంధించి నిందితుడు చెరుకూరి వంశీ అనే యువకుడిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. తన ఫొటోతో ఎవరో షాది డాట్‌కమ్ ఫేక్ అకౌంట్ ప్రారంభించి మోసాలు చేస్తున్నారని, ఇదివరలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ యానాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో నిందితుడు వంశీ ఆచూకీ కోసం గాలించారు. అయితే అతనిపై గత 8 ఏళ్లలో హైదరాబాద్, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో పలు కేసులు నమోదుకాగా నాలుగేళ్ల వరకు జైలుశిక్ష సైతం పడింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అశోక్ ఫొటోతో ఫేక్ అకౌంట్ మొదలు పెట్టినట్లు గుర్తించారు. నిందితుడు హైదరాబాద్ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుసుకున్న యానాం పోలీసులు అతనిని యానాం తీసుకువచ్చి విచారించారు. అయితే హైదరాబాద్‌లో కూడా అతనిపై పలు కేసులు ఉండటంతో తిరిగి అక్కడకు పోలీసులు తరలించగా రిమాండ్ విధించడంతో జైలుకు పంపినట్లు తెలిసింది.


సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

■ రాజమండ్రి J.N రోడ్ బెస్ట్ ప్రైస్ లేదా ONGC ఎదురుగా RTC కాలనీ లో 150 గజాలు G+1 నార్త్ ఫేసింగ్ బిల్డింగ్ అమ్మ కమునకు కలదు Con: 8179744420, 9573334993 [SCA-25003686]

PLOT FOR SALE

■ కాకినాడ, నాగమల్లితోట జంక్షన్ వద్ద పడమర ఫేసింగ్ 100 అడుగుల మెయిన్‌రోడ్‌ని అనుకుని 930 చ॥గ॥లు మరియు 846 చ॥గ॥లు కమర్షియల్ స్థలములు అమ్మకమునకు కలవు. ✆ : 92461 99099 [R-26]

■ కాకినాడ ఈస్ట్ పాయింట్ కాలనీ నందు (సురేష్ నగర్, శశికాంత్‌నగర్‌ల నుండి VS Lakshmi College కి గల 100 అడుగుల రోడ్‌కు) తూర్పు వైపు 33 అడుగుల సి.సి.రోడ్‌ని అనుకుని నూతనంగా నిర్మించిన పార్క్ ఎదురుగా, ఆదిత్య నర్సింగ్ కాలేజికి ముందు సౌత్ ఫేసింగ్ (40x60) కొలతలతో 266.66 చ॥గ॥ల చొప్పున 5 స్థలములు, పార్క్‌కి దక్షిణ వైపు 40 అడుగుల రోడ్‌ను అనుకుని నార్త్ ఫేసింగ్ (40x78) కొలతలతో 346.66 చ॥గ॥ల చొప్పున 5 స్థలములు అమ్మకమునకు కలవు. ✆ : 92461 99099 [R-25]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2627]

Wanted

■ కాకినాడ రోహన్ డిజిటల్స్ నందు పనిచేయడానికి హెల్పర్స్, ఫోటోషాప్ డిజైనర్స్, క్యాషియర్స్ (మహిళ) కావలెను. ✆ : 98482 14444 [R-SCA25003949]

■ హన్మకొండ జిల్లా స్వచ్ఛంద సంస్థ నందు వంట చేయుటకు భార్యాభర్తలు కావలెను. ఉచిత వసతి + భోజనం కల్పించబడును. సెల్: 8074465703, 9849038142. [WA-15653]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం: 18k. Ph: 9640258899, 9640468899 [HA-1909]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు, RMP&డాక్టర్స్ కావలెను.జీ:15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7993583999 [HA-639]

■ సాయిరామ్ హోమ్‌కేర్ Hydలో బేబీ& పేషెంట్‌కేర్, ముసలివారిని చూసుటకు ఆయాలు/ నర్సులు ఇంటి/వంట పనికి ఆడ /మగ కావలెను . జీ: 18 వేలు. 9949094607,9908454607 [SCA25003999]

■ వైజాగ్‌లో ప్రముఖ టైర్ కంపెనీలో డిగ్రీ చదివిన 18-24 సం॥లు ఉన్న అమ్మాయిలు (F) కి ట్రైనింగ్ & స్టైఫండ్ తో ఉపాధి కల్పించబడును. శిక్షణ కాలంలో ఉచిత వసతి+ స్టైఫండ్ 7000/- PM ఇవ్వబడును. ఫోన్: 80192 55667. [V- 7008]

■ Wanted Drivers to work at Rajahmundry for light/heavy vehicles, exp. minimum 3 years, good salary. contact ✆ : 98490 63511 / 83175 51220 [SCA25003985]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్

నాలుగు లైన్లకు రూ. : 400/-

అదనపు లైనుకు రూ. : 90/-

GST 5% Extra

సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.

ఫోన్స్: 0883-2483010

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.